క్లుప్తంగా

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి



నేర చరిత్ర కలిగిన వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

కర్నూలు (టౌన్): నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు. ఆదివారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు వివిధ పోలీసు స్టేషన్లలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సత్ప్రవర్తనతో జీవించాలని, చట్ట వ్యతిరేక కార్యాకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. చట్ట ప్రకారం నడుచుకోకుంటే కఠిన చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు.

డ్రైవర్ల సంఘం అధ్యక్షుడితో భేటీ



నూతన అధ్యక్షుడు రమేష్‌బాబును కలిసిన జిల్లా డ్రైవర్ల సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డ్రైవర్ల కేంద్ర సంఘం నూతన అధ్యక్షుడిగా ఎంపికైన పి.రమేష్‌బాబును కర్నూలు జిల్లా అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు ఆధ్వర్యంలోని బృందం కలిసింది. ఆదివారం గుంటూరులోని రెవెన్యూ భవన్‌లో నూతన అధ్యక్షుడిని నాగేశ్వరరావుతో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకోబ, గౌస్‌బాషా, దాదాబాషా, నాగమద్దిలేటి, శివ, విష్ణు, సుంకన్న, ఇబ్రహీం కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకు ఆ స్థానంలో ఉన్న సంసాని శ్రీనివాసరావుపై ఆరోపణలు రావడంతో అతని స్థానంలో పి.రమేష్‌బాబును ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ వాహన డ్రైవర్లు ఎదుర్కొనే సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు జిల్లా నాయకులు చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో కాంస్యం కైవసం



కాంస్య పతకం సాధించిన కర్నూలు బాలికల జట్టు

కర్నూలు (టౌన్): రాష్ట్ర స్థాయి ఆట్యా - పాట్యా పోటీల్లో కర్నూలు బాలికల జట్టు కాంస్య పతకం సాధించింది. ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు ఒంగోలు పట్టణంలో రాష్ట్రస్థాయి జూనియర్ ఆట్యా-పాట్యా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న కర్నూలు బాలికల జట్టు కాంస్య పతక పోరులో నెల్లూరు జిల్లా జట్టుపై 12-8 పాయింట్ల తేడాతో గెలుపొంది పతకాన్ని చేజిక్కించుకుంది. పతకం సాధించిన బాలికల జట్టును ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కే.నాగరత్నమయ్య అభినందించారు.

13న ట్రాక్టర్, స్కూటర్ ర్యాలీ



మాట్లాడుతున్న జి.రామకృష్ణ

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ప్రభుత్వం అమెరికా, బ్రిటన్లతో చేసుకున్న ఒప్పందాలతో రైతాంగానికి తీవ్ర నష్టం కలుగుతుందని, ఆ ఒప్పందాలను నిరసిస్తూ రైతు సంఘాల ఆధ్వర్యంలో 13వ తేదీన చేపట్టే ట్రాక్టరు, స్కూటర్ ర్యాలీని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే దేశంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని, ఈ సమయంలో ఆ దేశాలతో కేంద్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలతో రైతులు, కార్మికులు, చేనేత వృత్తిదారులు తీవ్రంగా నష్టపోతారన్నారు. వెంటనే ఆయా దేశాల ఒప్పందాలను రద్దు చేయాలని కోరుతున్నట్లు చెప్పారు. సీఐటీయూ నాయకులు రాముడు, రాజశేఖర్, సాయిబాబా, గురుశేఖర్ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

తుగ్గలి : ఐదు రోజుల క్రితం తప్పిపోయిన మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందాడు. రాతనకు చెందిన రాఘవరెడ్డి(65) ఈనెల 6న బళ్లారిలో జరిగిన బంధువుల పెళ్లికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. మానసిక స్థితి సరిగా లేని ఆయన అక్కడ తప్పిపోయారు. కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోయింది. ఆదివారం ఆలూరు బస్టాండ్‌లో అచేతనంగా పడి ఉన్న ఆయనను స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే నీరసించిపోయిన ఆయన చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతదేహాన్ని స్వగ్రామం రాతనకు తీసుకొచ్చారు. మృతుడికి భార్య హనుమంతమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

స్వాతంత్ర్య సౌరభం





స్వాతంత్ర్య దినోత్సవం సమీపిస్తున్న నేపథ్యంలో నగరంలోని కొండారెడ్డి బురుజుకు అధికారులు జాతీయ జెండా రంగులు కలిగిన విద్యుదీపాలంకరణ ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం విద్యుదీపాలంకరణలో వెలుగులీనుతున్న కొండారెడ్డి బురుజును చూసేందుకు పట్టణవాసులు ఆసక్తి చూపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

12 నంది అవార్డుల గ్రహీత పల్లేటి



పల్లేటి కులశేఖర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాకారులు

కర్నూలు(సెంట్రల్): ఆధునిక పద్య నాటకంలో వ్యక్తిగతంగా 12 నంది అవార్డులు, 86 ఇతర అవార్డుల గ్రహీత పల్లేటి కులశేఖర్ అని, ఆయన తెలుగు పద్య నాటక రంగానికి గర్వకారణమని వక్తలు కొనియాడారు. ఆదివారం కళాక్షేత్రంలో పద్య నాటక రచయిత పల్లేటి కులశేఖర్ ప్రథమ వర్ధంతి సభ జరిగింది. సభకు అధ్యక్షత వహించిన పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. టీజీవీ కళాక్షేత్రానికి సంబంధించి ఆయన చేసిన రచనలకు 35 అవార్డులు వచ్చాయన్నారు. ఆయన టీజీవీ కళాక్షేత్రం ఆస్థాన కవిగా పేరు తెచ్చుకున్నట్లు చెప్పారు. అనంతరం ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యదర్శి యాగంటి ఈశ్వరప్ప, కళాకారులు జీవీ శ్రీనివాసరెడ్డి, పి.రాజారత్నం, గాండ్ల లక్ష్మన్న, కదిరి రమేష్, కేవీ రమణ, పీపీ గురుమూర్తి, లక్ష్మీకాంతరావు, క్రిష్టఫర్, మద్దయ్య, సి.నవీన్‌కుమార్‌చౌదరి, శామ్యూల్, హార్మోనిస్టు బలరాముడు పాల్గొన్నారు.

ప్రేమ, సున్నితత్వం మేళవింపు కాశీభట్ల



సంచికను ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

కర్నూలు(సెంట్రల్): కాశీభట్ల కవిత్వం ప్రేమ, సున్నితత్వం మేళవింపు అని ప్రముఖ కవి వంశీకృష్ణ అన్నారు. ఆదివారం పింగళి సూరన తెలుగుతోటలో అక్షరం లిటరరీ ట్రస్టు ఆధ్వర్యంలో కాశీభట్ల వేణుగోపాల్ పురస్కార సభ ట్రస్టు కార్యదర్శి ప్రముఖ కవి జి.వెంకటకృష్ణ సభాధ్యక్షతన జరిగింది. కాశీభట్ల వేణుగోపాల్ పేరుతో ఇచ్చే పురస్కారాన్ని కర్నూలుకు చెందిన కవి తెలుగు వెంకటేష్‌కు పురస్కారం, రూ.25 వేల నగదు, జ్ఞాపికను అందించారు. సభలో ఆయన సంస్మరణ సంచికను అతిథులు ఆవిష్కరించారు. అనంతరం అతిథిగా హాజరైన వంశీకృష్ణను సత్కరించారు ట్రస్టు సభ్యులు అవిజ వెంకటేశ్వర రెడ్డి, ప్రముఖ కథారచయితలు మారుతి పౌరోహితం, డాక్టర్ హరికిషన్, డాక్టర్ నాగేశ్వరాచారి, జంధ్యాల రఘుబాబు, ఎస్‌డివి అజీజ్ కళ్యాణదుర్గం, స్వర్ణలత, ఎల్లమర్తి రమణమ్మ పాల్గొన్నారు.

రేపు ఎన్‌జీజీఓస్ నేతల రాక

కర్నూలు(అగ్రికల్చర్): ఏపీ ఎన్‌జీజీఓస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఈ నెల 12న కర్నూలుకు రానున్నారు. ఉమ్మడి జిల్లా శాఖ అధ్యక్షుడైన వీసీహెచ్ వెంగళరెడ్డి జిల్లా ట్రెజరీలో సీనియర్ అకౌంటెంటుగా పనిచేస్తూ జూలై 31న పదవీ విరమణ పొందారు. అదే రోజున ట్రెజరీ అధికారులు, ఉద్యోగులు ఆయన్ను సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ క్రమంలో ఈ నెల 12న జిల్లా ఎన్‌జీజీఓస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నూలులోని బిర్లాగేట్ సమీపంలోని లక్ష్మిఫంక్షన్ హాల్‌లో సన్మానసభ జరుగనుంది. ఈ కార్యక్రమానికి ఎన్‌జీజీఓస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ, రాష్ట్ర సహా అధ్యక్షులు దస్తగిరిరెడ్డి కూడ హాజరు కానున్నారు. 20 ఏళ్లపాటు జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన వెంగళరెడ్డిని సత్కరించిన అనంతరం కర్నూలు, నంద్యాల జిల్లాలకు వేరువేరుగా అడ్‌హాక్ కమిటీలను రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ ప్రకటించే అవకాశం ఉంది. జిల్లా ఎన్‌జీజీఓస్ అసోసియేషన్ కార్యవర్గం పదవీ కాలం జూలై 10వ తేదీతోనే ముగిసింది. అందువల్ల అడ్‌హాక్ కమిటీల ఏర్పాటు అత్యవసరం అయింది. ఆరేడు నెలలుగా జిల్లా అధ్యక్షుడిగా ఉన్న వెంగళరెడ్డిపై సంఘంలోని వారే తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. రాష్ట్ర సంఘానికి ఫిర్యాదులు చేస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో అడ్‌హాక్ కమిటీలో ఎవరి ముద్ర ఉంటుందనేది చర్చనీయాంశం అయ్యింది. కర్నూలు జిల్లాకు అడ్‌హాక్ కమిటీ చైర్మన్‌గా ఎంసీ కాశన్నను ప్రతిపాదిస్తున్నారు. ఈయన వ్యవసాయ శాఖలో జూనియర్ అసిస్టెంటుగా పని చేస్తూ కర్నూలు నగర శాఖ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.

మైపర్‌లో ప్రాంగణ నియామకాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

కర్నూలు సిటీ: మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో అరబిందో ఫార్మా కంపెనీ నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఆదివారం ఆ కాలేజీలో ఫార్మసీ విద్యను అభ్యసించిన విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించేందుకు జాబ్ మేళా నిర్వహించారు. మేళాను ఆ కాలేజీ అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ ప్రారంభించి ప్రసంగించారు. అరబిందో ఫార్మా కంపెనీ వారు నిర్వహించిన మేళాను అర్హత ఉన్న విద్యార్థులు వినియోగించుకోవాలని, ప్రతి ఏటా తమ కాలేజీలో చదివిన విద్యార్థులకు వంద శాతం ప్లేస్మెంట్ వస్తున్నాయన్నారు. అదే విధంగా కర్నూలు జిల్లాలోని ఫార్మసీ విద్యార్థులు సైతం తమ కాలేజీలో నిర్వహిస్తున్న మేళాలో ఉద్యోగాలు పొందుతుండటం సంతోషంగా ఉందన్నారు. మేళాలో ఎం.ఫార్మసీ, బీఫార్మసీ, బీఎస్సీ, డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులు 100 మందికిపైగా పాల్గొన్నారన్నారు. అర్హత కలిగిన వారందరికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. ప్రిన్సిపల్ డా.కె మహలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ కాకర్ల సురేష్, అకాడమిక్ డీన్ రాజ్‌కుమార్, ప్లేస్మెంట్ అధికారి కాకర్ల ప్రశాంత్‌కుమార్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించవచ్చని సూచించారు. కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ అధికారులు అర్జీలు స్వీకరిస్తారని వివరించారు.

అర్జీల పరిష్కార సమాచారం కోసం 1100 ఫోన్ నంబర్

పీజీఆర్‌ఎస్‌లో సమర్పించిన దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవాలన్నా 1100 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు.

నేడు నగరపాలకలో..

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పాలకలోని అన్ని విభాగాల అధికారులు పాల్గొంటారని వెల్లడించారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

13న తలసేమియా బాధితులకు రక్తదానం

కర్నూలు (టౌన్): స్థానిక కొండారెడ్డి బురుజు వద్ద ఈనెల 13వ తేదీ ఉదయం 11 గంటలకు తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తదానం కార్యక్రమం నిర్వహించనున్నట్లు కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.శ్రీహర్ష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తదానం చేయడం వల్ల ఒక నిండు ప్రాణం కాపాడిన వారమవుతామని చెప్పారు. రక్తం ఇచ్చేందుకు ఆసక్తి గల దాతలు 79939 91234 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బాలికపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

కర్నూలు(సెంట్రల్): బాపట్ల జిల్లా కారంచేడులో రజక బాలికపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సి.గురుశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈనెల 8వ తేదీన ఇంటి ముందు ముగ్గు వేసుకునే క్రమంలో ఐదుగురు రజక మహిళలను యార్లగడ్డ శ్రీకృష్ణ, ఆయన భార్య సుజాత నోటికి వచ్చినట్లు తిట్టి హింసించారని, కర్రతో కొట్టడంతో ఓ ముగబాలిక తీవ్రంగా గాయపడినట్లు చెప్పారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరారు.

సుంకేసులకు కొనసాగుతున్న వరద

కర్నూలు సిటీ: ఎగువ రాష్ట్రంతో పాటు జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో తుంగభద్ర నదికి వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం సుంకేసుల బ్యారేజీకి ఉదయం 6 గంటలకు 72 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా సాయంత్రానికి 70 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. బ్యారేజీ నుంచి 66,176 క్యూసెక్కుల నీటిని 16 గేట్లను పైకెత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కేసీ కాలువకు 2,012 క్యూసెక్కుల నీటిని పంపిణీ చేస్తున్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం

- వీధుల్లో మురుగునీటి ప్రవాహం
- దోమల వృద్ధితో అవస్థలు
- పట్టించుకోని అధికారులు



పంచలింగాల ఎస్సీ కాలనీలో లోపించిన పారిశుద్ధ్యం

కర్నూలు(రూరల్): గ్రామాల్లో మురుగు ముందుకు కదలనంటోంది.. నివాసాల పక్కనే చెత్త చెదారం పేరుకుపోతోంది. పారిశుద్ధ్యం మెరుగునకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నా అది కేవలం ప్రచారానికే పరిమితమైంది. చెత్త తొలగించే కార్యక్రమాలు చేపట్టకపోవడంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది.

వీధుల్లోనే మురుగు

మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. గ్రామాల్లో పక్కా డ్రైనేజీలు లేక రోడ్లపైనే మురుగు పారుతోంది. దీంతో వీధులన్నీ దుర్గంధం వెదజల్లుతున్నాయి. దోమల బెడద అధికం కావడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మండల వ్యాప్తంగా 23 గ్రామ పంచాయతీలున్నాయి. ఇందులో పడిదెంపాడు, ఆర్.కె.దుద్యాల, దిగువపాగు, జి.సింగవరం, ఆర్. కొంతలపాడు, సుంకేసుల, పంచాలింగాల, తదితర గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. అధికారులు పారిశుద్ధ్య పనులను గాలికి వదిలేశారు. కార్మికులు ఉన్నా గ్రామాల్లో చెత్త చెదారాన్ని తొలగించడం లేదు. దీంతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతోంది. ఇక ఇళ్లలోని వాడకం నీరు, మురుగు నీటితో కలిసి రోడ్లమీద పారుతోంది. మురుగు నీటి నిల్ల ఏర్పడటంతో దోమల ఉధృతి పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దోమల బాధ భరించలేక సాయంత్రం కాగానే ప్రజలు ఇళ్లకు తలుపులు వేసుకుంటున్నారు. అధికారులు సిబ్బంది విధులకు హాజరయ్యామా? వెళ్లామా? అనే పరిస్థితి తప్ప విధి నిర్వహణలో జవాబుదారీతనం కొరవడింది. మండల స్థాయి అధికారులు సైతం గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించడం లేదు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను ఆయా గ్రామాల్లో ఒక్కరోజు ఆర్భాటంగా నిర్వహించడం ఆ తర్వాతా కార్యక్రమ ఉద్దేశాన్ని గాలికి వదిలేయడం పరిపాటిగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా చెత్త నుంచి సంపద సృష్టించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన కేంద్రాలకు చెత్త తరలించకపోవడంతో అవి కాస్తా నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



పడిదెంపాడులో పూడికతో నిండిన డ్రైనేజీ

రోడ్లపైనే మురుగు నీరు



మా వీధిలో పారిశుద్ధ్యం లోపించింది. డ్రైనేజీలు అస్తవ్యస్తంగా మారాయి. లింగమయ్య కట్ట పరిసర ప్రాంతాల్లో ఎక్కడి చెత్త అక్కడే పడేస్తున్నారు. డ్రైనేజీ పూడికతో నిండి మురుగు నీరు ముందుకు కదలక తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. అలాగే రోడ్డుపైనే మురుగు నీరు పారుతోంది. దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి.

– చిన్న నాగేష్, బీసీ కాలనీ, పడిదెంపాడు



జి.సింగవరం ఎస్సీ కాలనీలో ఇళ్ల ముందు పారుతున్న మురుగు

వేద విద్యార్థులకు దంత పరీక్షలు



దంత వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాయలసీమ బ్రాంచి ఆధ్వర్యంలో కర్నూలులోని శంకర వేద విద్యాలయం విద్యార్థులకు ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని కరివేన బ్రాహ్మణ సత్రం కార్యదర్శి డాక్టర్ ఎస్.వేణుగోపాల్ ప్రారంభించారు. ఐడీఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ శిబిరంలో 80 మంది వేద విద్యార్థులకు, 26 మంది పరిచారకులకు దంత శుభ్రత గురించి అవగాహన, దంత పరీక్షలు నిర్వహించి, పేస్ట్, బ్రష్, మౌత్‌వాష్‌లు ఉచితంగా పంపిణీ చేశారు. చిన్నపిల్లల్లో తరచుగా కలిగే ప్రమాదాల గురించి, దంతాలను కాపాడుకునే పద్ధతుల గురించి వైద్యులు వివరించారు. ఐడీఏ ఉపాధ్యక్షుడు డాక్టర్ కిశోర్‌కుమార్, జి.పుల్లారెడ్డి దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగలక్ష్మిరెడ్డి, డాక్టర్ ఉపేంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ సునీల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ నౌషాద్, డాక్టర్ నరేష్‌గౌడ్, డాక్టర్ హిమబిందు, డాక్టర్ శ్వేత, డాక్టర్ సతీష్, డాక్టర్ మజర్, డాక్టర్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై సస్పెన్షన్ వేటు

- ఎంహెచ్‌ఓకు షోకాజ్ నోటీసులు..?
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

కర్నులు (టౌన్): జిల్లా కలెక్టరేట్‌లో మూడు రోజుల క్రితం కలెక్టర్ రంజిత్ బాషా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, అన్ని విభాగాల ద్వితీయ శ్రేణి అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో నగరపాలక ఆరోగ్య శాఖ పనితీరుపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిత్యం అపరిశుభ్రంగా ఉంటుంది. అక్కడే వ్యాపారాలు, తిను బండారాల ఆంగళ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకోవడంతో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు సైతం పనులు చేయలేని పరిస్థితి. దీంతో ఎప్పుడు అస్తవ్యస్తంగా ఉంటుందని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే బి.క్యాంపు చివరి నుంచి రాజ్‌విహార్ వరకు దుమ్ము,ధూళితో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయాన్ని కమిషనర్‌కు చెప్పా.. అయినా మార్పు లేదు. అసలు పారిశుద్ధ్య విభాగం అధికారులు పనిచేస్తున్నారా.. ముందుగా అక్కడ పనిచేసే శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేయండి. అలాగే ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ కమిషనర్‌ను ఆదేశించారు. అదే రోజు రాత్రి కమిషనర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్‌ను సస్పెండ్ చేశారు. అలాగే ఎంహెచ్‌ఓకు సైతం షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. అయితే ఈ ఆదేశాలు బయటికి రాకుండా అధికారులు గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. ఇప్పటికే సస్పెండ్ చేసిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ స్థానంలో మరో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. కమిషనర్ పి.విశ్వనాథ్ కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో జరిగే ప్రతి కార్యక్రమం పత్రికల్లో రావాలని చెబుతుంటారు. అయితే సస్పెండ్, షోకాజ్ నోటీసుల విషయంలో మాత్రం ఎందుకంత జాగ్రత్తలు తీసుకున్నారో అర్థం కావడం లేదు. తప్పు చేసిన వారికి, పనిచేయని వారికి నోటీసులు, సస్పెండ్‌లు సహజమే కదా. ఎందుకంత గోప్యం అన్న చర్చ జరుగుతోంది. అయినా శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు స్థాన చలనం కల్పించడం కాదు. ముందుగా పర్యవేక్షణ చేస్తున్న వారు ఏ విధంగా పనిచేస్తున్నారన్న విషయంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. పై వాళ్ల సస్పెన్షన్‌లను కప్పిపుచ్చిన అధికారులు ఓ ఆరుగురు శానిటరీ సెక్రటరీలు ప్రణీత, రాధిక, జయమ్మ, సంపత్‌కుమార్, మహమ్మద్ హాఫీజ్, ఫరూక్ అబ్దుల్లాకు మాత్రం షోకాజ్ నోటీసులు ఇవ్వడంలో అత్యుత్సాహం ప్రదర్శించారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గజదొంగ అరెస్ట్

- 16 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం



నిందితుడిని అరెస్టు చూపుతున్న కర్నూలు టౌన్ డీఎస్పీ బాబుప్రసాద్, సీఐలు

కర్నూలు (టౌన్): చోరీలకు పాల్పడుతున్న దొంగను పోలీసులు అరెస్టు చేశారు. గత కొంతకాలంగా కర్నూలు నగరంలోని కొత్తబస్టాండ్ వద్ద ప్రయాణికుల బ్యాగుల దొంగతనాలు జరుగుతున్నాయి. బాధితులు నాలుగవ పట్టణ పోలీసులకు, ఆర్టీసీ బస్టాండ్ పోలీసులకు ఫిర్యాదులు చేశారు. కేసులు నమోదు చేసుకున్న పోలీసులు బ్యాగ్ లిఫ్టింగ్‌లకు పాల్పడుతున్న నిందితుడు నంద్యాల పట్టణంలో ఉన్నట్లు గుర్తించారు. డీఎస్పీ నేతృత్వంలో కర్నూలు నాలుగవ పట్టణ సీఐ విక్రమసింహా, ఎస్ఐ మోహన్ కిషోర్, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ ఎస్ఏ.ఖాద్రి, ఎస్.షాకీర్, కానిస్టేబుల్ ఎల్లా శివుడు, సుబ్బరాయుడు, లక్ష్మణ్, నాయక్ ప్రత్యేక బృందంగా ఏర్పడి నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం సిద్ధాపురం గ్రామం రాములవారి వీధికి చెందిన గున్న అంజిని అరెస్టు చేసినట్లు కర్నూలు టౌన్ డీఎస్పీ బాబుప్రసాద్ ఆదివారం తన కార్యాలయంలో వెల్లడించారు. నిందితుడి నుంచి 16 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బంగారు అభరణాలను సంబంధిత యజమానులకు కోర్టు ద్వారా అప్పగిస్తామని డీఎస్పీ తెలిపారు.

సీపీఐ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



బి.గిడ్డయ్య | ఎస్.మునెప్ప | నక్కిలెనిన్‌బాబు

కర్నూలు(సెంట్రల్): సీపీఐ నూతన జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ప్రకటించారు. నగరంలోని పున్నమి ఫంక్షన్ హాలులో జరుగుతున్న 24వ జిల్లా మహాసభల్లో రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా కార్యదర్శిగా మరోసారి బి.గిడ్డయ్య ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా ఎస్.మునెప్ప, నక్కిలెనిన్‌బాబును ఎన్నుకున్నారు. వీరితోపాటు జిల్లా కార్యవర్గ సభ్యులుగా జగన్నాథం. నబీరసూల్, మద్దిలేటి శెట్టి, రాజా సాహెబ్, రామకృష్ణారెడ్డి, లలితమ్మ, శ్రావణిరెడ్డి, పంపన్న గౌడు, భాస్కర్ యాదవ్, జి.చంద్రశేఖర్, రంగన్న, విరుపాక్షి, కారు మంచి సుదర్శనం, కె.శ్రీనివాసులు, బి.రాజులను ఎన్నుకోగా.. 65 మంది జిల్లా సమితి సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సహాయ కార్యదర్శి మున్వార్ల నాగేశ్వరరావు ప్రకటించారు. ఈ నూతన కమిటీ జిల్లాలో ప్రజాసమస్యలు, జిల్లా సమగ్రాభివృద్ధి కోసం నిరంతరం పోరాటాలు చేస్తుందని వివరించారు.

17న పరుగు పందెం

మద్దికెర: ఈ నెల 17వ తేదీన శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని రాయలసీమ స్థాయి పరగుపందెం పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. 17న సాయంత్రం మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలోని శ్రీకృష్ణుడి దేవాయలం నుంచి మద్దికెరలోని శ్రీకృష్ణుడి దేవాలయం వరకు 3.5 కి.మీ దూరం పరుగు పందెం ఉంటుందని చెప్పారు. ప్రతిభ చూపిన వారికి వరుసగా.. రూ.10,116, రూ.5,116, రూ.3,116 అందజేస్తామని చెప్పారు. ఆసక్తి గల యువకులు వివరాలకు సెల్ 98852 97904 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కార్మికుల సమస్యలపై పోరాటం



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కల్లూరు: కార్మికుల సమస్యలపై సీఐటీయూ నిరంతరం పోరాడుతుందని జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ అన్నారు. ఆదివారం కల్లూరు మండలం దూపాడు గ్రామంలో ఆంజనేయులు అధ్యక్షతన సీఐటీయూ రెండో మహాసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి, మండల కార్యదర్శి ఎ.కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సమ్మెను నిర్వహించామన్నారు. కార్మికులకు రాజకీయ చైతన్యం అవసరమన్నారు. అనంతరం నూతనంగా 15 మందితో సీఐటీయూ మండల కమిటీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్‌గా కె.మధు, కో-కన్వీనర్‌గా బి.చంద్రశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హమాలీ, ఆటో, భవన నిర్మాణం, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.